అమృతవర్షిణి  - ఆది

విన్నవించితిమి నీకు - వేడుక వేళ
కన్నెను నీవు దయ - గాచేటి వేళ

1. మచ్చికలు దయివారె - మనసెల్ల జైవారె
వచ్చె జవ్వనానకు - వసంతవేళ
చొచ్చి నిన్ను బాసి తాప - సూర్యుడెండగాయగా
విచ్చల విడిగా దోచె - వేసగి వేళ

2. సిగ్గులు మొలువజొచ్చె - చెమట లేరులు హెచ్చె
కగ్గు లేక వచ్చె వాన - కాలపు వేళ
వెగ్గళించి సెలవుల - వెన్నెలలు చూపట్ట
ఒగ్గీ శరత్కాలము - ఒదిగీ నీవేళ

తత్తరపు చలి మించె - తలపోత మంచు మించె
యెత్తి అలమేల్మంగకు - హే మంత వేళ
బత్తితో శ్రీ వేంకటేశ - పైకొని కూడితి విట్టె
చిత్తజు కాకలు దీరె - శిశిర వేళ

స్వామికది మన్మధ విలాస వేళ. అన్నమయ్య అలమేల్మంగను స్వామితో శోభనవేళకు అప్పగింతలు పెట్టేవేళ. ఆ వేళ షడృతువులూ ఆమె లో విలసిల్లినవి. ఋతు సుదర్శనుడు ఆ వేంకటపతి. 'ఋతు స్సుదర్శనః కాలః' అని విష్ణు సహస్రనామస్తోత్రం జీవులకు ఉచ్ఛాస్వ నిచ్ఛ్వాస క్రియచే ప్రాణశక్తి పరిణామం చెంది వారి వారి జీవనకాల ప్రమాణం హరింప బడుతూ ఉన్నందున కాలప్రభావం తెలుస్తున్నదని కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని ఉవాచ. అలమేల్మంగ నిత్యయౌవన కాలరహిత కాలస్వరూపుడు స్వామి దిక్కాలాదుల ప్రభావం వారి కంటదు.

'దిక్కాలా ద్యనవచ్ఛినాయంత మూర్తయే
స్వానుభూత్యేక మానాయ, నమశ్శాన్తాయ తేజసే' అంటాడు

భర్తృహరి కాలాకాళాదులచేత అనవచ్ఛేద నీయమూ, అనంతమూ అయి స్వానుభవం అనే కొలతకు మాత్రమే కొలవవచ్చే శాంతాకార తేజోకృతియైన కేవలజ్ఞాన మూర్తికి నమస్కారం అని భావం. కాలప్రభావం అలమేల్మంగను అంటరాదు కానీ అదే జరిగిందంటున్నారు అన్నమాచార్యులు.

1. అలమేల్మంగ సౌందర్యముతో నెచ్చెలితనం నిగిడించిన ప్రకృతికి మనసు నిలువ రాక, ఆమనిగా అలమేల్మంగను అలంకరించిన వేళ - వసంతర్తువు.

2.అలమేల్మంగ నిత్యవిరహిణి. స్వామి దూరమైన కారణాన విరహతాప సూర్యుడు ఎండలు మండించగా ఆమెలో ప్రస్ఫుటమైనది వేసవివేళ - గ్రీష్మర్తువు.

3. ఆమెలో సిగ్గుల పంటలు మొలకలెత్తినవి. చెమట వానలు హెచ్చినవి. ఏమాత్రం వసివాడని ఆమెను అతిశయించిన వానకాలం ఆశ్రయించిన వేళ - వర్షర్తువు.

4. అలమేల్మంగ కళాస్థానాలలో దర్శనమిచ్చి తమ వెన్నెలల విభవాలన్ని ఆమెలో ఒదిగించి, శరజ్జ్యోత్స్నలు అలరిన వేళ - శరదృతువు.

5. ప్రథమ సమాగమంలోని జంకు, వణుకులతో, చల్లని తెల్లని మధురోహల మంచులు మించి ఆమెను ముంచెత్తినవేళ హేమంతర్తువు.

6. శ్రీవేంకటేశ్వరుడామెతో గూడి, మరుకుంపటి వద్ద చలిగాగినవేళ అది - శిశిరర్తువు.

అలమేల్మంగ ప్రకృతికాంత. స్వామి పురుషోత్తముడు అందుకే ఆయనకై ఆమెలో షడృతువులూ ఏకకాలమందు పరిఢవిల్లినవి. అనంత వసంతాల సంతత రసామృతవర్షిణీసంకీర్తనం అన్నమాచార్యులది.